## రాజీవ్ యువ వికాసం మార్గదర్శకాలను సడలించాలి

హిమాయత్ నగర్, మార్చి30: రాజీవ్ యువ వికాసం పథకంలో అనేక మెలికలతో నిబంధనలను పెట్టిన ప్రభుత్వం వాటిని తక్షణమే సడలించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ వికాసం పథకం పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డు తప్పనిసరి అని ప్రభుత్వం ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 16 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ ఒక్కరేషన్ కార్డు సైతం మంజూరు చేయలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పేరుతో యువతకు మొండి చేయి చూపించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## మేయర్‌ను కలిసిన హెచ్‌సీఏ కార్యదర్శి

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెక్రెటరీ శ్రీ ఆర్. దేవరాజ్ ఆదివారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె. కేశవ రావు, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, బీఆర్ఎస్‌నేత కె. విప్లవ కుమార్ తదితరులను బంజారాహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు . ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీం ఇండియా జట్టు మేనేజర్ గా పనిచేసిన దేవరాజ్ టీమిండియా జెర్సీని అందజేశారు.– బంజారాహిల్స్

## నడిరోడ్డు పైనే చేపల విక్రయం

ముషీరాబాద్, మార్చి 30 : ముషీరాబాద్ చేపల మార్కెట్ రోడ్డు మీదికి వచ్చింది. వ్యాపారులు క్రమం గా ప్రధాన రోడ్డుకు ఇరు వైపులా అమ్మకాలు సాగిస్తున్నా రు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విశాలమైన ప్రదేశంలో చేపల మార్కెట్ కడతామంటే అంగీకరించని వ్యాపారులు చేపల అమ్మకాలు మాత్రం రోడ్డుమీద చేపడుతూ ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగిస్తున్నారు.

# సంప్రదాయబద్ధంగా 'ఉగాది'

## పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు పచ్చడిని పంపిణీ చేసిన నిర్వాహకులు

బంజారాహిల్స్, మార్చి 30: శ్రీ విశ్వావసు నామ నూతన సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ల పరిధిలో ఉగాది సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆస్థానం పేరుతో స్వామివారికి నూతన వస్త్రాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఫిలింనగర్ దైవ సన్నిధానంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఉగాది సందర్భంగా దర్శనాల కోసం తరలివచ్చారు. ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, దైవ సన్నిధానం కార్యదర్శి పరుచూరి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.



షేక్‌పేట్ డివిజన్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్



శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

### సుఖ దుఃఖాలను సమంగా స్వీకరించడమే ఉగాది

వెంగళరావునగర్ : సుఖ దుఃఖాలను సమంగా స్వీకరించడమే ఉగాది సందేశమని బీఆర్ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ అన్నారు. ఆదివారం శ్రీవిశ్వావసు నామ ఉగాది పర్వదిన వేడుకలు షేక్ పేట్‌లో ఘనంగా జరుపుకునారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బలరామ్, రాజ్‌కుమార్, ఎల్లేష్, లక్ష్మణ్, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు

### ఊరూ– వాడలో ..

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మణికొండ, శంషాబాద్, నార్సింగి, బండ్లగూడ జాగీర్, రాజేంద్రనగర్ పట్టణం ప్రాంతాలలోని గ్రామ గ్రామాన ఉగాది పర్వదిన పండగ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ప్రతి ఇంట ఆకుపచ్చని తోరణాలను అలంకరించి నూతన తెలుగు సంవత్సరాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ప్రతి ఇంట షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడిని తయారు చేసుకుని జీవితంలో మంచి చెడులు సుఖసంతోషాలు అన్నింటిని ఏకరూపంగా అనుభవిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఉగాది పండుగ ప్రత్యేకతను చాటుకున్నారు. ఆయా ప్రాంతాలలో వేరువేరుగా జరిగిన పంచాంగ పట్టణ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



ఘాన్సిమియాగూడలోని హనుమాన్ దేవాలయంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకుడు, పాల్గొన్న గ్రామస్తులు



బాబుల్‌రెడ్డినగర్‌లో పచ్చడి పంపిణీలో పాల్గొన్న సభ్యులు



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సీ ఎన్ రెడ్డి తదితరులు.

### ఘనంగా ఉగాది వేడుకలు

మైలార్‌దేవ్‌పల్లి: ఉగాది పండుగ సందర్భంగా బస్తీలు, కాలనీల్లో సందడి నెలకొంది. పంచాంగ శ్రవణంతో దేవాలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



—హైదర్‌గూడ పోచమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్న దేవాలయ కమిటీ సభ్యులు

### హైదర్‌గూడలో...

అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని దేవాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. తయారు చేసిన ఉగాది పచ్చడిని దేవాలయానికి తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు.

### మైలార్‌దేవ్‌పల్లిలో...

బాబుల్‌రెడ్డినగర్‌లో సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పురస్కరించుకొని బొడ్రాయి ఆవరణలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నవ యువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సనాతన సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, శేఖర్, కృష్ణ, ప్రవీణ్, సన్నీ, దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ..



ఖానాపురం గ్రామంలో నిర్వహించిన పంచాంగ పట్టణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

### పలు ఆలయాల్లో పంచాంగ పఠనం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మున్సిపాలిటీలోని శంషాబాద్ పట్టణంలోని పాత శంషాబాద్‌లోని కాపుగడ్డ, యాదవ్‌బస్తీ, పోచ్చమ్మబస్తీ, కుమ్మరిబస్తీ, మక్తా బహదూర్‌అలీ,మధురానగర్, ఆర్బీనగర్, సిద్ధాంతి, రాళ్లగూడ, ఇంద్రారెడ్డి కాలనీ, ఎయిర్‌పోర్టు కాలనీ, కొత్వాల్‌గూడ, శాతంరాయి, గొల్లపల్లి, ఊటుపల్లి, తొండుపల్లి,ఘాన్సిమియాగూడ, శంకరాపూర్, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమిదుల్లానగర్, రషీద్‌గూడ, బహదూర్‌గూడలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆయా వార్డులలోని హనుమాన్ దేవాలయాల్లో పంచాంగం అర్చకులచే చదివించారు.

### శంషాబాద్ మండలంలో

ఉగాది వేడుకలు మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామాల్లో పచ్చడి తయారు చేసి ఆనందగా జరుపుకున్నారు. మధ్యాహ్నం మండలంలోని సుల్తాన్‌పల్లి, నర్కూడ, కాచారం, నానాజీపూర్, పెద్దషాపూర్, నర్కూడ, మల్కారం, కవ్వగూడ,రామంజాపూర్,ముచ్చింతల్, పాలమాకుల, పెద్దతూప్ర,జూకల్ గ్రామాల్లో విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా అర్చకులు పంచాంగం చదివి వినిపించారు

జూబ్లీహిల్స్: ఉగాది పర్వదినం సందర్భంగా రహమత్ నగర్ డివిజన్ కూడలిలో అన్నపూర్ణ దేవి అన్నసమర్పణ సొసైటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, ప్రసాదం పంపిణీ చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ సీ ఎన్ రెడ్డి, సొసైటీ సభ్యులతో కలిసి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.


## మల్లన్న స్వామి కళ్యాణం గోడ పత్రిక ఆవిష్కరణ



దేవాలయం ఆవరణలో మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 30: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీలోని దేవాలయంలో మల్లన్న స్వామి కళ్యాణం పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. కురుమ కులస్తుల సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మొండ్ర నర్సింహ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 20న ఆదివారం మల్లన్న కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొండ్ర గౌరీశంకకర్, సులిగే వెంకటేష్, మల్లన్న స్వామి కమిటీ అధ్యక్షులు కాడెం నర్సింగ్‌రావు, భంగి శ్రీనివాస్, ఎస్.మహేందర్, బి.శ్రీనివాస్, ఎస్.రమేష్, పూర్ణచందర్, ఎన్.రాజు, బండారు రమేష్, బి.హరినాథ్, కె.ప్రసాద్, ఎస్.ఆనంద్, ఎస్.ధనుంజయ్, ఎం.హరి, పి.రాజు, ఎస్. శివ, ఎన్.అజయ్, జి.ఐలేష్, నర్సింహ, కె.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'మనం సైతం' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మనం సైతం వ్యవస్థాపకుడు కాదాంబరి కిరణ్ తదితరులు

మణికొండ, మార్చి 30: 'కాదంబరి ఫౌండేషన్–మనంసైతం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీ ఎల్ఐజీ ప్రాంగణంలో రెనోవా హాస్పిటల్ విద్యానగర్ వారి సహకారంతో 'కాదంబరి ఫౌండేషన్–మనంసైతం' సంస్థ వ్యవస్థాపకులు కాదంబరి కిరణ్ నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వందలాది మంది పాల్గొని, వైద్య సేవలను పొందారు. ఈ శిబిరంలో కంటి, దంత, బీపీ, హార్ట్, వెయిట్, బీఎంఐ, క్యాన్సర్, హోమియో, బీఎండీ వంటి వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాదంబరి ఫౌండేషన్–మనంసైతం సంస్థ నిర్వాహకులు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం.. ఎవరికైనా మంచి ఆరోగ్యానికి మించిన సంపద లేదు. అందుకే ఈ పండగ రోజున ప్రముఖ ఆస్పత్రుల డాక్టర్లతో కలిసి ఈ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,పలువురు నటీనటులు, వివిధ శాఖల సినీ కార్మికులు పాల్గొని 'మనం సైతం' స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు.



### కవేలిగూడలో చలివేంద్రం ప్రారంభం


ప్రజలకు వేసవిలో తాగునీరందించాలనే లక్ష్యంతో స్థానిక నాయకుడు మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ మండలం కవేలిగూడ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేష్, రాజు, రాజేందర్‌రెడ్డి, యాదయ్య, విజయ్,శ్రీనివాస్, ఈశ్వరయ్య, శ్రీకాంత్, కుమార్, కృష్ణ, శ్రీహరిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.
– శంషాబాద్ రూరల్, మార్చి 30



### దాహం తీర్చేందుకు..

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ శంకర్ విలాస్ చౌరస్తా వద్ద వేసవికాలం సందర్భంగా స్థానికుల దాహార్తిని తీర్చేందుకు ఆదివారం బీఆర్ఎస్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేష్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ లోని పలు బస్తీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.
– బంజారాహిల్స్, మార్చి 30:

### దేవాలయ గుడి నిర్మాణానికి భూమి పూజ



లక్ష్మీగూడ పోచమ్మ దేవాలయ భూమి పూజలో పాల్గొన్న దేవాలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 30: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడలో కొత్తగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించామని త్వరితగతిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.రఘుపతి ముదిరాజ్, దారముని రమేష్‌ముదిరాజ్, నర్సింహముదిరాజ్, ఎన్.శంకర్, రఘుసాగర్, నాగేష్‌గౌడ్, నర్సింగ్‌రావు, మహేందర్‌ముదిరాజ్, బాలరాజ్‌ముదిరాజ్, విగ్నేష్‌ముదిరాజ్, లక్ష్మణ్‌ముదిరాజ్, సురేష్‌ముదిరాజ్, అడికే మారప్ప, సి.రాజుముదిరాజ్ తదతరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని ప్రచారం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 30 : భారత రాజ్యాం గాన్ని పల్లె పల్లె నా కళాకారులచే ప్రచారం చేయాలని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేం ద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్లో ఉగాది నూతన సంవత్సరం సందర్భంగా భార త రాజ్యాంగ శ్రవణం చేశారు.

## హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని విరమించుకోవాలి

హిమాయత్ నగర్, మార్చి30: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములను వేలం పాటలో అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జేసీబీలతో చదును చేస్తుండగా యూనివర్సిటీ భూములను కాపాడేందుకు వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని అక్రమంగా వారిని అరెస్ట్ చేయడం సరికాదని, ప్రజా పాలనలో విద్యార్థులపై ఉక్కుపాదం మోపడం ఏంటని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం యూనివర్సిటీ భూముల అమ్మకాలపై మొండిపట్టుకు పోకుండా యూనివర్సిటీలో ఉన్నతమైన ప్రమాణాలు, పరిశోధనలు, నాణ్యమైన విద్యతో దక్షణ భారతదేశంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రీసెర్చ్ సెంటర్లు, ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాల భూమి అవసరం ఉంటుందని , యూనివర్సిటీ భూముల రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖను పెట్టుకుని యూనివర్సిటీ భూములు అమ్మడం సిగ్గు చేటని విమర్శించారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు ఉండే యూనివర్సిటీలో వందలాది పోలీసులతో పాలన చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. యూనివర్సిటీ భూముల అమ్మకాల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గర్వ'

**– రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాం**

**సమావేశంలో వివరాలు వెల్లడించిన ప్రతినిధులు**



గర్వ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు

మణికొండ, మార్చి 30 : ప్రజల సమస్యల పరిష్కారం కోసం (గర్వ) గ్రేటర్ అల్కాపూరి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ప్రారంభించామని అసోసియేషన్ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మణికొండ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరూ మా అసోసియేషన్‌లో చేరవచ్చని స్వాగతించారు. ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించడానికి మా అసోసియేషన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఉగాది పండుగ రోజు ఆదివారం శుభ సూచకంగా 750 మందితో గర్వా అసోసియేషన్ ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అత్యధికంగా మణికొండ మునిసిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభం దశలోనే అల్కాపురి కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసి వివరిస్తామన్నారు.స్థానిక చిన్న చెరువులో గుర్రపుడెక్క బాగా పెరిగిందని, అధికారులు వెంటనే దానిని తొలగిస్తే దోమల బెడద తప్పుతుందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా గర్వ అసోసియేషన్ సభ్యులు ప్రకటించారు. అల్కాపూర్ కాలనీలో భూకబ్జాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం గర్వ జనరల్ సెక్రెటరీ వినయ్ కుమార్ తణుకురి మాట్లాడుతూ.. 15, 20 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నామని ఎన్నో సమస్యలను గుర్తించామని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గర్వ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు నివరతి సురేష్, ఎంఆర్ఎన్ దిలీప్, కిరణ్ కుమార్, పురుషోత్తం రావు, శ్రీధర్, శ్రావణ్ కుమార్, చిరాన్ జిత్ గోష్, అనుపమ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సేవా భావంతో పనిచేయాలి

కాచిగూడ, మార్చి 30: సేవ భావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని హైకోర్టు న్యాయవాది రాజేశ్ ప్రజాపతి అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం రైజింగ్ హాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు రాజేశ్ ప్రజాపతి ఆధ్వర్యంలో ఓల్డేజ్ హోమ్‌లోని వికలాంగులకు నిత్యావసర వస్తువులు, పేద విద్యార్థులకు ఉచితంగా నోటు బుక్స్, పండ్లు , బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా భావంతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బాబ్జీ, వెంకటేశ్, కృష్ణ, వాసు, ప్రవీణ్, పండిత్, అశుతోశ్ కుమార్ పాల్గొన్నారు.


### పెట్టుబడి దారులకు ప్రభుత్వం వత్తాసు

ముషీరాబాద్, మార్చి 30 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్రమించుకొని వేలం వేసేందుకు సిద్ధమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శి అనిల్ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారుల దాహం తీర్చేందుకే భూముల అమ్మకానికి ఓడి కట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం భూమిని ఎరగా చూపి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు తాకట్టుపెట్టడంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములనే కొల్లగొట్టేందుకు సిద్ధమైందన్నారు.

## రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



జూబ్లీహిల్స్,మార్చి 30; భక్తి శ్రద్ధలతో రోజా ఉపవాస దినాలు పూర్తి చేసుకున్న ముస్లింలు నేడు ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం ఘనంగా జరుపుకోనున్నారు. రంజాన్ ప్రార్థనలు నిర్వహించేందుకు రహమత్ నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్ మైదానంలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంజాన్ ప్రార్థనలకు పెద్ద ఎత్తున షామియానాలు, కార్పెట్లు వేయడంతో క్వారీ ల్యాండ్ కొత్త శోభను సంతరించుకుంది. జీ హెచ్‌ఎం సీ 19 వ సర్కిల్ లోని యూసుఫ్‌గూడ, వెంగళరావు నగర్, రహమత్ నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌ల్లో మసీదుల వద్ద మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచి మసీదు లతో పాటు ఈద్గా లలో ఉదయం 10 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.



**పచ్చడి పంపిణీ:** యూసుఫ్‌గూడలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పర్వదినం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, సంఘం సభ్యులతో కలిసి ఉగాది పచ్చడి, ప్రసాదం పంపిణీ చేశారు.
– జూబ్లీహిల్స్,మార్చి 30:



ఉగాది సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యే పూజలు నిర్వహించారు. – బంజారాహిల్స్